జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

ఆదివారం
08-11-2026

సంపుటి 1 | సంచిక 346

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)

కోడంగల్ ఎత్తిపోతల టెండర్లపై

కేటీఆర్ సంచలన ఆరోపణలు!

రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు ప్రాజెక్టు వ్యయం ఎలా పెరిగింది?



దశ, హైదరాబాద్: కోడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లోపించిందని శనివారం సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. మంత్రి కంపెనీ టెండర్లలో పాల్గొనగా, మిగతా సంస్థలు నామమాత్రంగా పోటీలో నిలిచాయని, చివరకు ఒక్క కంపెనీ మాత్రమే మిగిలేలా వ్యవహరం నడిచిందని ఆరోపించారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు ఎలా పెరిగిందని కేటీఆర్ ప్రశ్నించారు. దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగినా ఇప్పటివరకు ప్రజలకు ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడుతుంటే, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను వివరించేందుకు క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.



హకీంపేటలో

మెగా రైతు మేళా

పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

దశ, వికారాబాద్: కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సహచర మంత్రులతో కలిసి సీఎం పరిశీలించి, ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఉత్పత్తులతో పాటు పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శించారు. ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులు, వ్యవసాయ అనుబంధ పారిశ్రామిక సాంకేతికతకు సంబంధించిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులందరూ మెగా రైతు మేళాను సందర్శించి వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన పద్ధతులు, ఆధునిక పరికరాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆధునిక సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, ఎంపీలు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు

జ్వాల దశ

దీపావళి శుభాకాంక్షలు

దీపావళి సందర్భంగా మా కార్యాలయానికి ఆదివారం సెలవు. కావున జ్వాల దశ సోమవారం సంచిక వెలువడదు . పునర్దర్శనం మంగళవారం.

- మేనేజింగ్ డైరెక్టర్



తెలంగాణలో మరో కొత్త జిల్లా?


ఫ్యూచర్ సిటీ కేంద్రంగా ఏర్పాటు చేసే యోచన? జైపాల్‌రెడ్డి పేరు పెట్టే అవకాశం పై ప్రచారం

దశ, హైదరాబాద్: తెలంగాణలో మరో కొత్త జిల్లా ఏర్పాటు కానుందనే ప్రచారం రాజకీయ, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ శివార్లలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ జిల్లాకు దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెట్టే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. ప్రతిపాదిత జిల్లాలో హయత్‌నగర్‌తో పాటు ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, మహేశ్వరం, కల్వకుర్తి, దేవరకొండ నియోజకవర్గాలు ఉండవచ్చని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జైపాల్‌రెడ్డి స్వగ్రామం

..మిగతా 4వ పేజీలో ➔

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నందిగామలో అభివృద్ధి పనులకు శ్రీకారం.. ఎంఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుకు మంత్రి పొంగులేటి ప్రకటనల




దశ, షాద్‌నగర్: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి నందిగామ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. నందిగామలో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. మహిళాసమాఖ్య, అంగన్‌వాడీ భవనాలు, రూ.2 కోట్లతో నిర్మించిన పీఎంశ్రీ పాఠశాల భవనం, ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి, నర్సప్పగూడకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో హైమాస్ట్ లైట్లను, మండల కాంగ్రెస్ కార్యాలయాన్ని

..మిగతా 4వ పేజీలో ➔

రోడ్లపై ధాన్యం.. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు!

పంటలు ఆరబెట్టేందుకు రహదారులే వేదిక.. కంకర రాళ్లతో ప్రమాదాలు



దశ, నిజామాబాద్: తెలంగాణలో వరి, మొక్కజొన్న కోతలు ప్రారంభం కావడంతో రహదారులపై పంటలను ఆరబెట్టే పరిస్థితి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. సరైన కల్లాలు, ధాన్యం ఆరబెట్టే సౌకర్యాలు లేక రైతులు ప్రధాన, గ్రామీణ రహదారులనే ఆశ్రయిస్తున్నారు. పంటలను వాహనాల నుంచి కాపాడేందుకు రోడ్లపై పెద్ద కంకర రాళ్లు పెడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పగటిపూట కొంతవరకు కనిపించే ఈ రాళ్లు రాత్రివేళ, పొగమంచు సమయంలో వాహనదారులకు కనిపించకపోవడంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. పలుచోట్ల వాహనదారులు అదుపుతప్పి కిందపడటం, తీవ్రంగా గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది వరంగల్ జిల్లాలో రహదారులపై పంటలు

..మిగతా 4వ పేజీలో ➔



ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేదా?

మరో అవకాశం!

అర్హులైన ఓటర్లు ఈ నెల 21లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి – సీఈఓ సుదర్శన్‌రెడ్డి

దశ, రంగారెడ్డి: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు తుది జాబితాలో చోటు కల్పించేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని

..మిగతా 4వ పేజీలో ➔



ఆదిలాబాద్ రిమ్స్‌లో వెంటిలేటర్ల చోరీ.. ముఠా అరెస్ట్!

టెక్నీషియన్లమంటూ ఆస్పత్రిలోకి ప్రవేశం.. హైదరాబాద్ వ్యాపారికి విక్రయం

దశ, ఆదిలాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో నాలుగు వెంటిలేటర్లను చోరీ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన సజ్జన్, అభిజిత్ టెక్నీషియన్లమంటూ ఆస్పత్రిలోకి ప్రవేశించి

..మిగతా 4వ పేజీలో ➔

ఆర్మీ క్యాంటీన్ మద్యం అక్రమ విక్రయాలు!

అల్వాల్‌లో రెండు చోట్ల ఎక్సైజ్ దాడులు.. 163 బాటిళ్లు స్వాధీనం

దశ, హైదరాబాద్: ఆర్మీ క్యాంటీన్‌లో సబ్సిడీ ధరలకు మద్యం కొనుగోలు చేసి బయట వ్యక్తులకు అక్రమంగా విక్రయిస్తున్న ముఠాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అల్వాల్ పరిధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో మొత్తం 163 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. లోతుకుంట సరస్వతి నగర్‌లో

..మిగతా 4వ పేజీలో ➔





3 రోజుల వ్యాపారానికే జీఎస్టీ భారం!

దీపావళి టపాసుల దుకాణదారులకు లైసెన్సుల మోత.. చిన్న షాపుపైనా రూ.60 వేల నుంచి రూ.70 వేల ఖర్చు.

దశ, హైదరాబాద్: దీపావళి పండుగ వేళ టపాసుల వ్యాపారం చేయాలనుకునే చిన్న వ్యాపారులకు అనుమతులు, లైసెన్సు ఫీజులు భారంగా మారాయి. అగ్నిమాపక, మున్సిపల్, ట్రాఫిక్, పోలీసు శాఖల అనుమతులతో పాటు ఈసారి జీఎస్టీ వసూళ్లు కూడా తమపై అదనపు భారం మోపుతున్నాయని వ్యాపారులు

..మిగతా 4వ పేజీలో ➔

48 గంటల్లో హిట్ అండ్ రన్ కేసు ఛేదన



❖ సీసీ కెమెరాల ఆధారంగా వాహనం గుర్తింపు.. క్రైమ్ కానిస్టేబుల్ జాషువాకు అభినందనలు

దశ, ఫ్యూచర్ సిటీ: హిట్ అండ్ రన్ కేసును ఫ్యూచర్ సిటీ పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడంలో కీలకంగా వ్యవహరించిన క్రైమ్ కానిస్టేబుల్ బి. జాషువాను ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్‌రెడ్డి అభినందించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నవంబర్ 4న రాత్రి 10.15 గంటలకు అర్లకుంట తండాకు చెందిన నేనావత్ నరేష్ (35), తన అన్న కుమారుడు గౌతమ్ (13)తో కలిసి బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా గద్దగుండు గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి పరారైంది. ఈ ప్రమాదంలో నరేష్ కాలు విరగగా, గౌతమ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నరేష్ సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్స్పెక్టర్ జానకిరామ్‌రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ కానిస్టేబుల్ జాషువా తలకొండపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి మహేశ్వరం గేటు వరకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించారు.

అది ఊరుకొండ గ్రామానికి చెందిన వ్యక్తికి సంబంధించినదిగా నిర్ధారించారు.ప్రమాదంచేసిపారిపోవడంనేరమని,సీసీకెమెరాలు పోలీసులకు మూడో కన్నులా ఉపయోగపడుతున్నాయని ఇన్స్పెక్టర్ జానకిరామ్‌రెడ్డి తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రమాద బాధితులకు సహాయం చేసి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై కె. శేఖర్, స్థానిక గ్రామస్తులు క్రైమ్ కానిస్టేబుల్ జాషువాను అభినందించారు.




వీసీపై మహిళా ప్రొఫెసర్ లైంగిక వేధింపుల ఆరోపణలు!

❖ ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్

దశ, హైదరాబాద్: వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్య తనను లైంగికంగా వేధించారని మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ ఆరోపించారు. తనతో ఏకాంతంగా గడపాలని, భర్త అంగీకరిస్తే తనను తీసుకెళ్తానని, 20 ఏళ్లు ముందుగా పుట్టి ఉంటే పెళ్లి చేసుకునేవాడినని వ్యాఖ్యానిస్తూ వేధింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఈ వ్యవహారంపై డీజీపీ, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు వస్తున్నాయని వెల్లడించారు. జానయ్యను తండ్రిలా భావిస్తే ఢిల్లీకి రావాల్సిందని, అక్కడికి వస్తే బదిలీ చేస్తానంటూ బెదిరించారని కన్నీటిపర్యంతమయ్యారు. తనకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మునగనూరులో ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్.. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసే చర్యలు



దశ, అబ్దుల్లాపూర్‌మెట్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు గ్రామ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని సర్వే నంబర్ 44లో ఉన్న ప్రభుత్వ భూమికి శనివారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి హద్దులను గుర్తించి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా భూముల అన్యాక్రాంతాన్ని అరికట్టడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా చూడవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హైదరాబాద్‌లో విద్యార్థి ఆత్మహత్య..!

ప్రిన్సిపాల్ వేధింపులే కారణమంటూ తోటి విద్యార్థుల ఆందోళన



దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో శనివారం ఉదయం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో కాలేజీలో విషాదం నెలకొంది. విద్యార్థి మృతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన తోటి విద్యార్థులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ వేధింపుల కారణంగానే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే ప్రిన్సిపాల్‌పై విద్యార్థులు చేసిన ఆరోపణలు ఇంకా నిర్ధారణ కాలేదు. విద్యార్థి మృతికి గల కారణాలు, వేధింపుల ఆరోపణల్లో వాస్తవాలపై పోలీసుల విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.



నారాయణ ప్రీమియర్ లీగ్‌లో హయత్‌నగర్ బ్రాంచ్ జోరు..

❖ వనస్థలిపురం జోన్ ఛాంపియన్‌గా ఘన విజయం!

దశ, హయత్‌నగర్: నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ (NPL) ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో హయత్‌నగర్ బ్రాంచ్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి వనస్థలిపురం జోన్ ఛాంపియన్‌గా నిలిచారు. కబడ్డీ, క్రికెట్, త్రోబాల్, డాడ్జ్‌బాల్, రన్నింగ్, చెస్ తదితర క్రీడా విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుకున్నారు. జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలతో పోటీపడి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వనస్థలిపురం జోన్ జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు విజేతలకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేసి అభినందించారు. హయత్‌నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి,మానస, హైస్కూల్ ఆర్ఎండీ శివరంజని, ఎన్‌పీఎల్ ఇన్‌చార్జి రోహిణి, ఈచాన్స్ ఆర్‌అండ్‌డీ మహేశ్వరి, ఈకిడ్స్ ఆర్‌అండ్‌డీ మీనా, స్పోర్ట్స్ ఆర్‌పీ సురేష్, సాఫ్ట్ స్కిల్స్ జాజి రెడ్డి, హైస్కూల్ కోఆర్డినేటర్ సృజన్, ఈచాన్స్ కోఆర్డినేటర్ దివ్య, ఈకిడ్స్ కోఆర్డినేటర్ ప్రియాంక, ఏడీ మంజుల, ఈచాన్స్ వీపీ కవిత, ఈకిడ్స్ వీపీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేత విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.

విద్యావంతుల చైతన్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ: నర్సంపేట BITSకళాశాలలో డాక్టర్ గడల శ్రీనివాసరావు



దశ, నర్సంపేట: నాణ్యమైన విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, సమాజ నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. నర్సంపేట నియోజకవర్గ నాయకులు మేరుగు శివకోటి యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (BITS) కళాశాలలో విద్యావంతులు, పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గడల శ్రీనివాసరావు కళాశాల అధ్యాపకులతో ముఖాముఖి మాట్లాడారు. ఉన్నత విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తు మరియు ఉపాధి అవకాశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో పట్టభద్రుల పాత్ర ఎంతో కీలకమని, విద్యావంతుల ఆలోచనలు, సామాజిక చైతన్యం, ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. సమాజంలో గుణాత్మక మార్పు తీసుకురావడానికి పట్టభద్రులు క్రియాశీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మిరియాల రామకృష్ణ, రాష్ట్ర నాయకులు రాము యాదవ్, బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్స్ హరిహరన్, శ్యాంసుందర్, సురేష్, సంపత్ రెడ్డి, వివిధ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు. వీరితో పాటు జనసేన పార్టీ జిల్లా నాయకులు గొల్ల రాజేంద్ర ప్రసాద్, కరాటే ప్రభాకర్, నియోజకవర్గ నాయకులు బొబ్బ పృథ్వీరాజ్, షేక్ హుస్సేన్, గంగుల రంజిత్, రోడ్డ శ్రీకాంత్, ఎలబోయిన దేవిడ్, గాండ్ల అరుణ్, రాజేందర్, భరత్, వివేక్ తదితరులు, ఉమ్మడి వరంగల్ జిల్లా, నర్సంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో జోరు

బండా శివారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నమోదు కార్యక్రమం పూర్తి



దశ ఓయూ: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ జోరుగా సాగింది. బీజేపీ నాయకుడు బండా శివారెడ్డి నేతృత్వంలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ప్రత్యేక నమోదు కార్యక్రమం శనివారం పూర్తయింది. ఈ సందర్భంగా సేకరించిన ఓటరు నమోదు దరఖాస్తులు, ఎన్‌రోల్‌మెంట్ వివరాలను బండా శివారెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు,జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండా కార్తీక చంద్రారెడ్డిని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా బండా శివారెడ్డి చేసిన కృషిని బండా కార్తీక చంద్రారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌పై ప్రత్యేక గీతం ఆవిష్కరించిన బంటి

❖ దాద్‌పల్లి గాయని పవనిక ఆలపించిన పాటకు విశేష స్పందన

దశ, ఇబ్రహీంపట్నం: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన గాయని పి. పవనిక ఈ పాటను ఆలపించారు. కేసీఆర్ నాయకత్వం, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్రను గుర్తుచేసేలా ప్రత్యేకంగా ఈ గీతాన్ని రూపొందించినట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గాయని పవనిక తన గానంతో కేసీఆర్‌పై ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారని అభినందించారు. స్థానికంగా ప్రతిభ కలిగిన కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాటను ఆవిష్కరించిన అనంతరం గాయని పవనికను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనితా వెంకటేష్ గౌడ్‌తో పాటు దాద్‌పల్లి గ్రామ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో కాలుష్య కారక పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి

❖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీలపై తక్షణమే తనిఖీలు చేపట్టాలి: బొజ్జ రాకేష్







దశ, ఓయూ: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను విడుదల చేస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సమన్వయకర్త బొజ్జ రాకేష్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బేగంపేటలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి జిల్లా పర్యావరణ ఇంజనీర్ వెంకట నర్సును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలోని కొన్ని కంపెనీలు నిబంధనలు పాటించకుండా పరిశ్రమల వ్యర్థాలు, కాలుష్య కారకాలను బయటకు విడుదల చేస్తున్న విషయాన్ని అధికారికి వివరించారు.పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషపూరిత వాయువులతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాయు కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పరిశ్రమల వ్యర్థాలు నీటి వనరుల్లో కలవడంతో తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలను గుర్తించి నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బొజ్జ రాకేష్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్, ఈసీఐఎల్ ఇన్‌చార్జి ఇప్పల కుమార్, సోమ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- మార్క్సిజమే మానవ సమస్యలకు పరిష్కారం
- ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపు
- నర్సంపేటలో 109వ వార్షికోత్సవ కొవ్వొత్తుల ర్యాలీ



దశ, నర్సంపేట: భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి విజయకేతనం ఎగురవేసిన రష్యన్ అక్టోబర్ మహా విప్లవ స్ఫూర్తితో దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేసి సమసమాజ స్థాపనకు నడుంబిగించాలని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. మానవాళి ఎదుర్కొంటున్న సకల సమస్యలకు మార్క్సిజమే అసలైన పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు.

అక్టోబర్ విప్లవ 109వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ కొవ్వొత్తుల (క్యాండిల్) ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ అంగడి సెంటర్‌లోని అమరజీవి, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ విగ్రహం వద్దకు చేరుకుంది. అక్కడ ఓంకార్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, పార్టీ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ... 1917లో లెనిన్ నాయకత్వంలో రష్యాలో విజయవంతమైన అక్టోబర్ మహా విప్లవం ప్రపంచవ్యాప్తంగా పీడిత, తాడిత ప్రజల విముక్తికి గొప్ప దిక్సూచిగా మారిందన్నారు. నాటి క్రూరమైన జార్ చక్రవర్తుల నిరంకుశత్వం, పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా మార్క్సిజాన్ని సరైన రీతిలో అన్వయించి రష్యా గడ్డపై తొలి సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించారని కొనియాడారు. నేటికీ సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా సాగే ప్రజా పోరాటాలకు అక్టోబర్ విప్లవమే నిరంతర ప్రేరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న నిరంకుశ పాలన, పెరుగుతున్న ఆర్థిక అసమానతలను రూపుమాపాలంటే ఎర్రజెండా శక్తులన్నీ ఏకం కావాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు.

చీలికలైన కమ్యూనిస్టులను, పీడిత సామాజిక శక్తులను ఐక్యం చేసేందుకు ఎంసీపీఐ(యు) నిరంతరం రాజీలేని కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ఆశయ సాధన దిశగా, అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రజా సమస్యలపై పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబురావు, వంగల రాగసుధ, జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, ఎల్లబోయిన రాజు, డివిజన్ నాయకులు జన్ను రమేష్, అనుమల రమేష్, నాగెల్లి భాస్కర్, పకిడే చందర్ రావు, గడ్డం స్వరూప, పుట్టపాక సునీత, గణిపాక బిందు, కళ్లేపెల్లి రాకేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆర్థిక సాయం



దశ, నర్సంపేట: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని సిహెచ్. కావ్య (కేథరిన్) కు జనతా ట్రస్ట్ ఆర్థిక చేయూత అందించింది. పుస్తకాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థిని పరిస్థితిని వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలుసుకున్న జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి వెంటనేస్పందించారు.పుస్తకాలకొనుగోలునిమిత్తంతక్షణ సాయంగా ₹12,000 నగదును అందజేశారు. అంతేకాకుండా, ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని సంవత్సరాల పాఠ్యపుస్తకాలను తానే సమకూరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లడంలో రఘుపతి, గాదే ఇసాక్ చొరవ చూపారు. కార్యక్రమంలో జనతా ట్రస్ట్ ప్రతినిధులు కుంకీస విష్ణోష్, అచ్చ దయాకర్, బానోతు రాజేందర్, అంబరబోయిన రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



దశ, హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించి,పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'నెక్ట్ జనరేషన్ సూర్యాపేట' కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలకు రూ. 30 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో మంజూరైన నిధులతో చేపట్టిన సివిల్ పనులు, మేజర్ మరియు మైనర్ మరమ్మతు పనుల పురోగతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.

పాఠశాల ఆటస్థలాన్ని (ప్లే గ్రౌండ్) వెంటనే లెవలింగ్ చేయించి,విద్యార్థినుల క్రీడా నైపుణ్యాల కోసం బాస్కెట్‌బాల్ మరియు వాలీబాల్ కోర్టులను నిర్మించాలి,అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పాఠశాలలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను నవంబర్ 20వ తేదీలోగా నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ 9వ తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలను చదివించి,పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థినులు చక్కగా సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ వారిని అభినందిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డి.నర్సిరెడ్డి,ఆర్డీవో తహశీల్దార్ పంచాయతీ రాజ్ డి.ఇ.రమేష్ పాల్గొన్నారు.

హబ్సిగూడలో సినీ నటుడు సుమన్ సందడి

బంగారం ధర తగ్గదు.. భూమి ధరలే తగ్గుతాయి అంటూ సరదా వ్యాఖ్యలు



దశ ఓయూ: దీపావళి పండుగను పురస్కరించుకుని సినీ నటుడు సుమన్ హబ్సిగూడలో సందడి చేశారు. స్థానికంగా ఉన్న నవకర్ గోల్డ్ షాప్‌ను సందర్శించి బంగారు ఉంగరాన్ని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా షాపు యాజమాన్యం అమిత్ జైన్ ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ.. ఎప్పటి నుంచో నవకర్ గోల్డ్ షాప్‌కు వచ్చి బంగారం కొనుగోలు చేయాలని అనుకుంటున్నానని, సమయం కుదరక ఇప్పటివరకు రాలేకపోయానని తెలిపారు. దీపావళి సందర్భంగా ఈరోజు బంగారం కొనుగోలు చేయడం సంతోషంగా ఉందన్నారు. షాపులో బంగారు ఆభరణాలతో పాటు వెండి, వజ్రాభరణాల్లోనూ అనేక రకాల ఆకర్షణీయమైన డిజైన్లు ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా భూమి ధరలు తగ్గుతాయేమో కానీ బంగారం ధరలు మాత్రం తగ్గవంటూ సరదాగా వ్యాఖ్యానించి నవ్వులు పూయించారు. సుమన్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నందికొండ శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ లబ్ధిదారులతో ఘనంగా దీపావళి వేడుకలు

దశ, హుజురాబాద్: పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హుజురాబాద్ ఆర్డీవో జలకుమారి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో సునీత స్పష్టం చేశారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారుల నివాసాల్లో స్థానికులతో కలిసి పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

ఈ సందర్భంగా ఆర్డీవో జలకుమారి, మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ..గతంలో అద్దె ఇళ్లలో అరకొర వసతుల మధ్య దీపావళి జరుపుకొన్న నిరుపేదలకు నేడు పక్కా ఇళ్లతో ఆత్మగౌరవంతో కూడిన భరోసా లభించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ గూడు కల్పిస్తామని తెలిపారు.

అలాగే కాట్రపల్లిని సంపూర్ణంగా 'ఆదర్శ గ్రామం'గా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. అనంతరం అధికారులంతా లబ్ధిదారుల కుటుంబసభ్యులతో కలిసి స్వయంగా దీపాలు వెలిగించి, వారికి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెరుమాండ్ల హైమా భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, గిర్దావర్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దీపావళి ఆనందం కావాలి.. పర్యావరణానికి ముప్పు కాకూడదు!

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

దశ ఓయూ: ఈ సంవత్సరం తెలంగాణతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌నినో, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యం వంటి అనేక అంశాలు వర్షపాతంపై ప్రభావం చూపుతున్నాయి. ప్రకృతి సమతుల్యత దెబ్బతినడంతో పలు మానవాళి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దీపావళి సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా, అధిక శబ్దం చేసే టపాసులు కాల్చడం వల్ల వాయు, శబ్ద కాలుష్యం మరింత పెరుగుతోంది. బాణసంచా నుంచి వెలువడే విషపూరిత వాయువులు, సూక్ష్మ ధూళి కణాలు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్నాయి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలి.

పర్యావరణ పరిరక్షణకు రాజ్యాంగ భరోసా

పర్యావరణాన్ని, అడవులను, వన్యప్రాణులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ఏ పేర్కొంటోంది. ప్రకృతి పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక విధి అని ఆర్టికల్ 51ఏ(జి) స్పష్టం చేస్తోంది. అలాగే ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్యకరమైన, కాలుష్యరహిత వాతావరణంలో జీవించే హక్కు ప్రాథమిక హక్కుల్లో భాగంగా గుర్తించబడింది. పర్యావరణ పరిరక్షణకు పలు చట్టాలు అమల్లో ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ చట్టం1986, వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం1981, శబ్ద కాలుష్య నియమాలు2000వంటి చట్టాలు కాలుష్యనియంత్రణకు తోడ్పడుతున్నాయి. బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలు పర్యావరణానికి హాని కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలి. ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని కఠినమైన బాణసంచా, అధిక శబ్దం చేసే టపాసుల వినియోగ నియంత్రణ చర్యలు అమలు చేయాలి.

పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు.. ప్రతి పౌరుడి కర్తవ్యం

మనకు కలిగినది ఒక్కరోజు ఆనందం మాత్రమే కాదు.. భవితరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పచ్చని ప్రకృతి, ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించడం కూడా మన బాధ్యత.

తీవ్ర మనస్తాపంతో పాకాల సరస్సులోకి దూకిన తల్లి, ఇద్దరు పిల్లలు.. వరంగల్ జిల్లాలో కలకలం

దశ, నర్సంపేట: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సులో శనివారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గీసుకొండ మండలం ఎల్కుర్తి హవేలీ గ్రామానికి చెందిన ఈరెల్లి మమత అనే వివాహిత, తన ఇద్దరు కుమార్తెలతో కలిసి సుమారు 10 గంటల సమయంలో సరస్సులోకి దూకింది. స్థానికులు వారిని రక్షించేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది; అప్పటికే ముగ్గురూ నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సహకారంతో మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. భర్త సుమన్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని వెళ్లిపోవడమే కాకుండా, ఆ మహిళ బంధువులు తమ ఇంటికి వచ్చి



నిలదీసి తీవ్రంగా దుర్భాషలాడారని, ఆ అవమానం, తీవ్ర మనస్తాపం భరించలేకే మమత తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, దుగ్గొండి సీఐ శంకర్రావు, ఖానాపురం ఎస్ఐ రామ్‌మోహన్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కుటుంబ కలహాలు మరియు వివాహేతర సంబంధ వివాదాల కోణంలో సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సొంతింటిలో దీపావళి వేడుకలు జరుపుకున్న వొడితల ప్రణవ్

దశ, హుజురాబాద్: హుజురాబాద్ ఇళ్లు లేని నిరుపేదలు గతంలో పూరి గుడిసెల్లో,కిరాయి ఇండ్లలో దీపావళి పండుగ జరుపుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంతిల్లు కట్టుకోవాలనుకున్న వారి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చి,ఇప్పుడు సొంత ఇంటిలో దీపావళి పండుగను జరుపుకునేలా వారికి ఆర్థిక భరోసా కల్పించెలా కృషి చేశామని,ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని,సంతోషాన్ని కలిగించిందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.హుజురాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామంలో



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగను జరుపుకున్నారు. అనంతరం వారికి మిఠాయిలు పంచిపెట్టి,బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 2500 ఇళ్లు పూర్తి అయ్యాయని,ధర్మరాజుపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 110 ఇల్లులు మంజూరు అయితే మెజారిటీ స్థాయిలో 60 ఇళ్ళులకు పైగా పూర్తి అయ్యాయని,మిగతావి కూడా పూర్తి అయ్యే స్టేజ్ లో ఉన్నాయని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇళ్లు కేటాయించి ఆదుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,స్థానిక గ్రామ సర్పంచ్,మండల,పట్టణ అధ్యక్షుడు కిరణ్, తిరుపతి, మహిళా అధ్యక్షురాళ్ళు లావణ్య, స్వప్న, రాధ, కల్పన,స్థానిక గ్రామ కాంగ్రెస్ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్నేహం ముసుగులో భారీ చోరీ..!

విద్యార్థినిని నమ్మించి పిన్ని ఇంటికి కన్నం.. 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి అపహరణ



దశ, హైదరాబాద్: స్నేహం పేరుతో నమ్మించి ఓ యువకుడు భారీ చోరీకి పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఓ కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్, అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థినితో పరిచయం పెంచుకుని ఆమె పిన్ని ఇంట్లో భారీగా బంగారం, వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి చోరీ సొత్తులో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. విద్యార్థిని పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు చంద్రశేఖర్ గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి అప్పులు తీర్చిన తర్వాత తిరిగి ఇచ్చేస్తానని విద్యార్థినిని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె ద్వారా ఇంటి తాళాలు సంపాదించాడు. గత అక్టోబర్ 20న పద్మావతి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లోకి ప్రవేశించి 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీ చేసిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు నిందితుడు అంగీకరించాడు. అతని నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, హైదరాబాద్‌కు లక్ష ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చించనున్నామని, ఇప్పటివరకు 2,25,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. లబ్ధిదారులకు ఆర్థిక సాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రంలోని 10,456 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని పెండింగ్ భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటుపై ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. నందిగామ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మండలంలో ఎంఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుకు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె. చంద్రారెడ్డి, డాక్టర్ కె. కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓ సరిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెంటిలేటర్ల చోరీ.. ముఠా అరెస్ట్!

మొదటి పేజీ తరువాయి

ఈ చోరీకి పాల్పడినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఈ మేరకు కేసు వివరాలను విలేకరుల సమావేశంలో తెలిపారు. గత నెల 30న రిమ్స్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఆర్ఐసీయూ, ఛాతీ వార్డుల నుంచి ఒక్కో వెంటిలేటర్‌తో పాటు టీబీ వార్డు నుంచి మరో రెండు వెంటిలేటర్లు అపహరణకు గురయ్యాయి. నిందితులు పరికరాలను సంచుల్లో పెట్టుకుని తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆస్పత్రి డైరెక్టర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన వెంటిలేటర్లను హైదరాబాద్‌కు చెందిన వైద్య పరికరాల వ్యాపారి కొండారెడ్డికి విక్రయించినట్లు ఎస్పీ తెలిపారు. చంద్రపూర్‌లో వాటిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి నాలుగు వెంటిలేటర్లు, కారు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేదా?

మరో అవకాశం!

మొదటి పేజీ తరువాయి

సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, డూప్లికేట్ (ASDD) కేటగిరీల్లో గుర్తించి ముసాయిదా జాబితాలో పేర్లు తొలగించినప్పటికీ, వాస్తవానికి అర్హులుగా ఉన్న ఓటర్లకు మరో అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. అర్హులైన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి సంబంధిత ఓటర్లను సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని, వాటిని ఎలా పూరించి సమర్పించాలో వివరించాలని సూచించారు. అవసరమైన వివరాలు, ప్రకటన పత్రాలను అనుబంధంఎ, బి, సి ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓలకు నేరుగా లేదా ఈసీఐ నెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇప్పటికే అదే చిరునామాలో నివసిస్తున్న వారు తగిన ప్రకటనతో పాటు ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలోని మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్నవారు పాత, కొత్త చిరునామాల వివరాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటరు నమోదుకు ఇప్పటికే ఫారం6 సమర్పించిన వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు తుది జాబితాలో చోటు కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు

ఆర్మీ మద్యం అక్రమ విక్రయాలు!

మొదటి పేజీ తరువాయి

మన్యం నాగప్రసన్న, ఆమె భర్త రామ్ ఆంజనేయులు నివాసంపై మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం దాడి చేసి 96 బాటిళ్లను పట్టుకుంది. భర్త ఆర్మీ క్యాంటీన్ నుంచి మద్యం తీసుకురాగా, భార్య ఇంటి నుంచే విక్రయాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మరో ఘటనలో న్యూ బోయిన్‌పల్లిలోని సౌజన్య కాలనీలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌బి దాడి చేసి ముసిమి లెంక (39) వద్ద 67 బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై నాగప్రసన్న, లెంకలను అరెస్ట్ చేసి అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

తెలంగాణలో మరో కొత్త జిల్లా?

మొదటి పేజీ తరువాయి

మాద్గుల కల్వకుర్తి నియోజకవర్గంలోనే ఉండటంతో ఆయన పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ప్రస్తుతం 56 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మహేశ్వరం మండలంలోని 28, కందుకూరు మండలంలోని 9 గ్రామాలను కూడా ఈ పరిధిలోకి చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు జనాభా లెక్కల సేకరణ నేపథ్యంలో 2027 మార్చి వరకు పరిపాలనా సరిహద్దుల మార్పులకు అవకాశం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో స్పష్టం చేశారు. జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణకు వచ్చిన వినతులను ఆ గడువు తర్వాతే జ్యుడీషియల్ కమిషన్‌కు పంపిస్తామని వెల్లడించారు. దీంతో కొత్త జిల్లా ఏర్పాటుపై 2027 మార్చి తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే కొత్త జిల్లా ఏర్పాటు చేసినప్పటికీ రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య పెరగకపోవచ్చనే చర్చ సాగుతోంది. గతంలో ఏర్పాటు చేసిన చిన్న జిల్లాల్లో కొన్నింటిని పొరుగు జిల్లాల్లో విలీనం చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దీపావళి ధమాకా..

దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల వ్యాపారం!

ఢిల్లీలోనే రూ.80 వేల కోట్ల టర్నోవర్ అంచనా.. 55 శాతం పెరిగిన ఆటోమొబైల్ అమ్మకాలు



దశ, న్యూఢిల్లీ: దీపావళి పండుగ సీజన్ దేశవ్యాప్తంగా వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ ఏడాది పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా సుమారు రూ.5 లక్షల కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. ఒక్క దేశ రాజధాని ఢిల్లీలోనే రూ.80 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతుందని వెల్లడించింది. గత నెలలో ర్యాలీలు, నిరసనల కారణంగా నష్టాలు ఎదుర్కొన్న ఢిల్లీ వ్యాపారులు దీపావళి అమ్మకాలతో తిరిగి లాభాల బాట పట్టే అవకాశం ఉందని సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ తెలిపారు. ఈసారి స్వదేశీ ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. మట్టి ప్రమిదలు, దేవతామూర్తుల విగ్రహాలు, హస్తకళా వస్తువులు, గృహాలంకరణ ఉత్పత్తులు, సంప్రదాయ చిహ్నాలకు భారీగా గిరాకీ ఏర్పడిందన్నారు. స్థానిక కళాకారులు, చేతివృత్తుల వారు తయారుచేసిన వస్తువుల అమ్మకాలు పెరగడం విశేషమని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు కూడా స్వదేశీ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడానికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్ రంగంలోనూ అమ్మకాలు గణనీయంగా పెరిగాయని సీటీఐ వెల్లడించింది. రిటైల్ ఆటోమొబైల్ విక్రయాలు 55 శాతం వృద్ధి చెందగా, ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 70 శాతం, ద్విచక్ర వాహనాలు 52 శాతం, త్రిచక్ర వాహనాలు 110 శాతం పెరిగినట్లు తెలిపింది. ఎఫ్ఎంసీజీ, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, మొబైల్ ఫోన్లు, ఫర్నిచర్, గృహోపకరణాల రంగాల్లోనూ భారీ వ్యాపారం జరుగుతుందని అంచనా వేసింది. దేశవ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల బహుమతుల ఇచ్చిపుచ్చుకోవడం కూడా పండుగ అమ్మకాలకు ఊతమిస్తోందని పేర్కొంది. ఢిల్లీలోని చాందినీ చౌక్, సదర్ బజార్, కమలా నగర్, రాజౌరీ గార్డెన్, లజపత్ నగర్ మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయని బ్రిజేష్ గోయల్ వివరించారు.



గ్రామ పంచాయతీలకు సర్కార్ తీపి కబురు!

సొంత ఆదాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే.. అక్టోబర్ 9 నుంచే కొత్త విధానం అమలు



దశ, హైదరాబాద్: తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రామ పంచాయతీలు పన్నులు, వివిధ రుసుముల రూపంలో సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాల్సిన అవసరం లేదని నిర్ణయించింది. ఈ ఆదాయాన్ని నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 9 నుంచే ఈ విధానం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. గతంలో పంచాయతీలు వసూలు చేసిన సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాల్సి వచ్చేది. తిరిగి గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే అనుమతులు, బిల్లుల ప్రక్రియలో జాప్యం జరిగేది. తాజా నిర్ణయంతో ఈ ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది. పంచాయతీల ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ కానుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, సిబ్బంది వేతనాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులకు సొంత ఆదాయాన్ని వినియోగించుకునే వెసులుబాటు కలగనుంది. అత్యవసర పనులపై వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడనుంది. ప్రభుత్వ తాజా నిర్ణయం గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబనకు, స్థానిక పాలన బలోపేతానికి దోహదపడనుంది.

మెమరీ లాస్‌తో ఐటీ ఎగవేత.. రూ.200 కోట్ల భూమి ఎలా కేటాయించారు?

సీఎం సోదరుడిపై మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు

దశ, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి ఆదాయపు పన్ను చెల్లించకుండా ఉండేందుకు మెమరీ లాస్ కారణంగా చూపించారని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఆయన, 2025 నవంబర్ 26న వెలువడిన ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను ప్రస్తావించారు. ట్రిబ్యునల్ ముందు కొండల్ రెడ్డి తరపు న్యాయవాది డిసోసియేటివ్ అమ్నీషియా (జ్ఞాపకశక్తి కోల్పోవడం), అధిక రక్తపోటు, మధుమేహం, తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వాదించారని క్రిశాంక్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో నిరంతరం చికిత్స పొందుతున్నట్లు కూడా ట్రిబ్యునల్‌కు వివరించారని తెలిపారు. 2023లో రుణ చెల్లింపులు జరగకపోవడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కొండల్ రెడ్డి ఇంటికి నోటీసులు పంపినట్లు ఆరోపించారు. మెమరీ లాస్‌తో బాధపడుతున్నట్లు ట్రిబ్యునల్ ముందు పేర్కొన్న వ్యక్తికి టెనెరాక్ట్ సంస్థ పేరిట సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని ఎలా కేటాయించారని క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ భూమి కేటాయింపుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

3 రోజుల వ్యాపారానికే జీఎస్టీ భారం!

మొదటి పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం మూడు రోజుల వ్యాపారం కోసం వేలాది రూపాయలు చెల్లించాల్సి రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వ్యాపారుల వాదన ప్రకారం, ఒక్కో దుకాణానికి వివిధ శాఖల అనుమతులు, లైసెన్సుల కోసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చవుతోంది. కొత్తగా జీఎస్టీ పేరుతో మరో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు భారం పడుతోందని చెబుతున్నారు. ఇతర ఖర్చులు, మామూళ్లు కలిపితే దుకాణం ఏర్పాటు చేయడానికే రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు అవుతోందని వాపోతున్నారు. షెడ్డు, భద్రతా ఏర్పాట్లు, అద్దెలు కలిపితే మొత్తం ఖర్చు రూ.1.50 లక్షల వరకు చేరుతోందని పేర్కొంటున్నారు. మరోవైపు టపాసుల ధరలు కూడా పెరిగాయి. పశ్చిమాసియాలో సంఘర్షణల కారణంగా సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, రసాయనాలు, ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఉత్పత్తి వ్యయం 30 శాతానికి పైగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. భద్రతా నిబంధనల ఉల్లంఘనల కారణంగా శివకాశీలోని కొన్ని టపాసుల కర్మాగారాలు ఎక్కువ కాలం మూతపడటంతో ఉత్పత్తి తగ్గిందని పేర్కొంటున్నారు. ధరల పెరుగుదల ప్రభావం కొనుగోళ్లపైనా కనిపిస్తోంది. గతంలో రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు టపాసులు కొనుగోలు చేసిన వినియోగదారులు ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకే పరిమితమవుతున్నారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ఉత్పత్తి వ్యయం పెరిగినా, ఆ భారాన్ని పూర్తిగా వినియోగదారులపై వేయలేకపోతున్నామని అంటున్నారు. ఆల్ ఇండియా ఫైర్‌వర్క్స్ అసోసియేషన్ రిటైల్ ధరలు పెంచకూడదని నిర్ణయించినప్పటికీ, పెరిగిన ఖర్చులన్నింటినీ వ్యాపారులే భరించడం సాధ్యం కాదని వాపోతున్నారు.టపాసుల వ్యాపారంలో హోల్‌సేల్ రంగం వాటా సుమారు 20 శాతం మాత్రమేనని, మిగిలిన 80 శాతం రిటైల్, ఆన్‌లైన్ విక్రయాల ద్వారా జరుగుతోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, కొనుగోళ్ల తగ్గుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న వ్యాపారులకు లైసెన్సులు, ఇతర అనుమతుల ఖర్చులు మరింత భారంగా మారాయి. ఈ అదనపు వ్యయాలు చివరకు టపాసుల ధరలపై ప్రభావం చూపి సామాన్య వినియోగదారుల జేబులకు చిల్లు పెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

రోడ్లపై ధాన్యం.. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు!

మొదటి పేజీ తరువాయి



ఆరబెట్టడం కారణంగా 38 ప్రమాదాలు సమోదైనట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు శాశ్వత వైకల్యానికి గురయ్యారు. వరంగల్-ఇనవోలు రహదారిపై వెంకట్‌రెడ్డి, చిన్న యాకూబ్ అనే ఇద్దరు మిత్రులు ప్రమాదంలో మృతిచెందిన ఘటన స్థానికులను ఇప్పటికీ కలచివేస్తోంది. పంటలను రోడ్లపై ఆరబెట్టడం రైతులకు ఇష్టపూర్వకంగా చేస్తున్న పని కాదు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఆరబోత కేంద్రాలు లేకపోవడం, కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడం, తేమ శాతం పేరుతో కొనుగోళ్లలో జాప్యం జరగడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పంటను త్వరగా ఆరబెట్టి విక్రయించాల్సిన పరిస్థితుల్లో రహదారులే వారికి అందుబాటులో ఉన్న మార్గంగా మారుతున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత పోలీసులు, అధికారులు రహదారులపై పంటలు ఆరబెట్టవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే హెచ్చరికలతోనే సమస్య పరిష్కారం కాదని రైతులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టే కల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఉపాధి హామీ పథకం లేదా ఇతర ప్రభుత్వ నిధులతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. పంటలను త్వరగా ఆరబెట్టేందుకు సబ్సిడీపై పరికరాలు, కవర్లు అందించాలని, కోతల సీజన్‌కు ముందే కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా పంటలు ఆరిన వెంటనే మిల్లులకు తరలించేలా రవాణా ఏర్పాట్లు చేయాలని, కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని కోరుతున్నారు. మరోవైపు రహదారుల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళ ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతుల పంటలు కాపాడటం ఎంత ముఖ్యమో, రహదారులపై ప్రయాణించే ప్రజల ప్రాణాలను రక్షించడం కూడా అంతే ముఖ్యం. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలి.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com